క్లుప్తంగా...

సిటీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం ప్రకటన

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల (అటానమస్)లో 2023–24 సంవత్సరానికి గాను బయోటెక్నాలజీ (1), ఆర్థిక శాస్త్ర విభాగంలో (2) తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియమాకానికి అర్హులైన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్ తెలిపారు. ఈ పోస్టులకు పీజీలో 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు సెప్టెంబర్ 24న సోమవారం ఉదయం 11 గంటలకు సిటీ కళాశాలలో హాజరుకావచ్చునన్నారు. పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, స్లెట్ వంటి అదనపు అర్హతతో పాటు బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

నేడు అలేఖ్య ఐకాన్ అవార్డుల ప్రదానం

గన్‌ఫౌండ్రీ: ఈనెల 23న రవీంద్రభారతిలో శ్రీసాయి అలేఖ్య సాంస్కృతి సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో అలేఖ్య ఐకాన్ అవార్డ్స్‌ను ప్రదానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు ఉపద్రష్ట అరుణా అశోక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి సభ్యులు ఎస్.మదుసుధనచారి, సినీ నటుడు సుమన్, పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. బలగం ఫేమ్ కొమురయ్యతో పాటు వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న పలువురికి ఐకాన్ అవార్డులను ప్రదానం చేస్తారని అదేవిధంగా సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అలీ హుస్సేన్‌కు సత్కారం



అబిడ్స్: మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ కనబరిచిన అలీ హుస్సేన్‌ను ఘనంగా సత్కరించారు. భూపాల్‌లో జరిగిన థర్డ్ ఇండియన్ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో అలీ హుస్సేన్ సిల్వర్ మెడల్ సాధించాడు. ఆయనను మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ షేక్ ఖలీల్, మీర్జా షబ్బీర్, జావేద్ అలీ రజ్వీ, అబ్దుల్ షకీల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు



అబిడ్స్: హజ్రత్ సయ్యద్ బహర్ అలీషా ఖాద్రి ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక ప్రాంతాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాల ప్రజలు హాజరై ప్రార్థనలు చేశారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మత సామరస్యానికి ప్రతీకగా ఉర్సు ఉత్సవాలు నిలుస్తాయన్నారు.

ఆషూర్‌ఖానాను సందర్శించిన మర్రి శశిధర్‌రెడ్డి



చార్మినార్: జాతీయ విపత్తుల సంస్థ మాజీ చైర్మన్ బీజేపీ సీనియర్ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డిని మీరాలంమండిలోని ఆషూర్‌ఖానాను సందర్శించి ఆలంకు పూలు, దట్టీలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయనతో పాటు బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు.

సౌదీ రిటర్న్ ఎన్‌ఆర్‌ఐలను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో పలువురు సౌదీ రిటర్న్‌లు

గోల్కొండ: సుదీర్ఘ కాలం సౌదీ అరబ్‌లో ఉండి స్వదేశానికి తిరిగి వచ్చిన ఎన్‌ఆర్‌ఐలను ప్రభుత్వం ఆదుకోవాలని సాప్ మెడికల్స్ మేనేజింగ్ డైరెక్టర్స్ డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. శుక్రవారం సాలార్‌జంగ్ కాలనీలోని కింగ్ డమ్ హౌస్‌లో సౌదీ రిటర్న్ ఎన్‌ఆర్‌ఐల రెండవ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలువురు ఎన్‌ఆర్‌ఐలు ఉద్యోగ రిత్యా సౌదీ అరేబియాకు వెళ్లారని, వివిధ రంగాల్లో అక్కడ వారు ఎంతో కష్టపడి పని చేశారన్నారు. వివిధ కారణాలతో పాటు స్వదేశానికి కూడా సేవ చేయాలనే దృక్పథంతో వారు హైదరాబాద్‌లో స్థిరపడ్డారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆబిద్ మోయిన్‌ను ఉత్తమ ఉర్దూ రచయితగా, జియా ఉర్ రహమాన్‌ను జిట్‌కో మార్కెట్ ఉత్తమ బిజినెస్‌మెన్‌గా సన్మానించారు. డయాలసిస్ రోగులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్న డాక్టర్ మహ్మద్ షోయబ్ అహ్మద్ ఖాన్‌తో పాటు డాక్టర్ మహ్మద్ ఆఖీబ్ అహ్మద్ ఖాన్‌లను ఉత్తమ వైద్యులుగా మెమెంటోలు ఇచ్చి సన్మానించారు.

ఆధ్యాత్మిక సందడి

- ఒకేరోజు మిలాద్–ఉన్–నబి, వినాయక నిమజ్జనోత్సవాలు
- పాతబస్తీలో కొనసాగుతున్న భారీ బందోబస్తు
- మిలాద్ జులూస్ అక్టోబర్ 1కి వాయిదా..
- తగిన ఏర్పాట్లలో పోలీసులు, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, జలమండలి అధికారులు



బేలా చందులాల్‌లో బందోబస్తును పరిశీలిస్తున్న సీపీ సీవీ ఆనంద్, డీసీపీ సాయి చైతన్య



మిలాదున్‌నబీ ఉత్సవాల కోసం విక్రయాలకు సిద్ధంగా ఉన్న జెండా సామగ్రీ

చార్మినార్: నగరంలో ఆధ్యాత్మిక వాతావారణం నెలకొన్నది. వినాయక నవరాత్రి ఉత్సవాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యతో కలిసి గురువారం అర్ధరాత్రి నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పాతబస్తీలో పర్యటించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఒకేరోజు రెండు ఉత్సవాలు కలిసి రావడంతో ఈసారి వేడుకలకు ప్రాధాన్యత ఏర్పడి అందరి చూపు పాతబస్తీ వైపు మళ్లింది. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 28న నిమజ్జనోత్సవాలను నిర్వహించడానికి గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. అదేరోజు మిలాద్–ఉన్–నబి వేడుకలు జరుగనున్నాయి. దీంతో ఎక్కడ ఎవరికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జీహెచ్‌ఎంసీ, పోలీసులు, జలమండలి, విద్యుత్ విభాగాల అధికారులు తగిన కార్యాచరణ రూపొందించుకుని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. 1985లో మొహర్రం సంతాప దినాలతో పాటు వినాయక నవరాత్రి ఉత్సవాలు ఒకేరోజు కలిసి వచ్చాయి. వినాయక ఉత్సవాలు..బక్రీద్‌పండుగ..మొహర్రం సంతాప దినాలు...ఇలా జంట కార్యక్రమాలు ఒకరోజు తేడాతో కలిసి రావడం ఇరు వర్గాల ప్రజలు సోదరభావంతో కలిసి మెలిసి ఉత్సవాలను నిర్వహిస్తూ మతసామరస్యాన్ని చాటి చెబుతున్నారు. ఈసారి నిమజ్జనోత్సవాల రోజే మిలాద్–ఉన్–నబి వేడుకలు న్నాయి. అయితే రెండు ర్యాలీలు ఒకేరోజు కావడంతో శాంతి భద్రతల దృష్ట్యా మిలాద్ జులూస్‌ను కొన్ని ముస్లిం మత సంస్థలు అక్టోబర్ 1వ తేదీకి వాయిదా వేశాయి.

పాతబస్తీలో కలిసి మెలిసి నిర్వహించుకోవడం ఆనవాయితీ...

నగరంలో ఏ ఉత్సవాలనైనా ఇరు వర్గాల ప్రజలు కలిసి మెలసి నిర్వహించుకోవడం నిజాం కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఈసారి ఒకేరోజు వినాయక నిమజ్జనోత్సవాలతో పాటు మిలాద్–ఉన్–నబీ వేడుకలు రావడంతో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే ఆయా మండపాలలో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు జరుగుతుండగా, మిలాద్–ఉన్–నబీ వేడుకల సందర్భంగా పాతబస్తీ వీధుల్లో జెండాల ఏర్పాటు అన్నదానం, సభలు, సమావేశాలు జరుగనున్నాయి. ఇప్పటికే నగర పోలీసు కమిషనర్ ఆధ్వర్యంలో అటు గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో పాటు ముస్లింలతో సమావేశాలు నిర్వహించి తగిన సలహాలు, సూచనలు చేశారు.

గతంలో..

- 2015 సెప్టెంబర్ 17న ప్రారంభమైన గణేష్ ఉత్సవాలు 27న ముగియగా.. మధ్యలో 9వ రోజు నిర్వహించిన గణేష్ నిమజ్జనోత్సవం నాడే బక్రీద్ పండగ వచ్చింది. దీంతో ముందే అప్రమత్తమైన జీహెచ్‌ఎంసీ, దక్షిణ మండలం పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పండగలు ప్రశాంతంగా ముగిశాయి.
- 2016 సెప్టెంబర్ 5న ప్రారంభమైన గణేష్ ఉత్సవాలు 15న ముగిశాయి. ఉత్సవాల మధ్యలో అంటే సెప్టెంబర్ 13న బక్రీద్ పండగ వచ్చింది. అదేరోజు 9వ రోజు వినాయక నిమజ్జనోత్సవాలుండటంతో ఇరువర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకున్నారు.
- 2017 ఆగస్టు 25న ప్రారంభమైన వినాయక ఉత్సవాలు సెప్టెంబర్ 5వ తేదీతో ముగిశాయి. సెప్టెంబర్ 2న బక్రీద్ పండుగ జరిగింది. అంటే వినాయక నిమజ్జనోత్సవాల 9న ముస్లిం ప్రజలు బక్రీద్ పండుగను జరుపుకున్నారు.
- 2015, 2016, 2017, వినాయక ఉత్సవాలు, బక్రీద్ పండగలు కలిసి వచ్చాయి.
- 2018, 2019 లలో వినాయక ఉత్సవాలు, మొహర్రం సంతాప దినాలు కలిసి వచ్చాయి.

మాదిగ యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలి



సాక్షి, సిటీబ్యూరో: నిరుద్యోగ మాదిగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి మాదిగ ఇండస్ట్రియల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (మిక్కీ) రాణించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆకాంక్షించారు. శుక్రవారం రెడ్ హిల్స్‌లోని ఫిక్కీ కార్యాలయంలో జరిగిన మిక్కీ విస్తృత స్థాయి ప్రతినిధుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాదిగ యువతీ, యువకులకు గొప్ప వ్యాపార వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు మిక్కీ కృషి చేయాలని వినోద్‌కుమార్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మిక్కి అధ్యక్షులు విప్లవ్ గాంధీ, ఫౌండర్ సభ్యులు మహేష్, మిక్కి రాష్ట్ర నాయకులు చైతన్య, ఉమాపతి, అభిలాష్, శ్యామ్ పాల్గొన్నారు.

ఏకగ్రీవ ఎన్నిక



అబిడ్స్: ఏకగ్రీవంగా ఎన్నికైన సెంట్రల్ సర్వే యూనిట్ అధ్యక్షుడిగా మహ్మద్ అబ్దుల్ సలీం, ఉపాధ్యక్షురాలుగా ఇ.సావిత్రి, కార్యదర్శిగా, ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ విశాలాక్షి, కోశాధికారిగా ఎం.రాజేశ్వరి, కార్యనిర్వాహక సభ్యులుగా మీర్ యూసుఫ్ అలీ, హేమలతను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సెంట్రల్ సర్వే యూనిట్ సభ్యులను హైదరాబాద్ టీఎన్జీఓస్ జిల్లా యూనియన్ అధ్యక్షులు డాక్టర్ ముజీబ్, కార్యదర్శి ఎస్.విక్రమ్‌కుమార్, అసోసియేషన్ అధ్యక్షులు కేఆర్.రాజ్‌కుమార్‌లు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ఎలక్షన్ అధికారి వైదిక్ శాస్త్రి, శ్రీధర్ నాయుడు ఉన్నారు.

అభినందనలు



సమావేశమైన ఎగ్జిబిషన్ నూతన కమిటీ పాలకవర్గం

అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీ నూతన కమిటీకి అభినందనలు వెల్లివిరిశాయి. నూతనంగా ఎన్నికైన వారందరికీ సొసైటీ పలు విభాగాలకు చెందిన ప్రతినిధులతో పాటు పెద్ద ఎత్తున ఇతరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, గౌరవ కార్యదర్శి హన్మంతరావు, జాయింట్ సెక్రెటరి చంద్రజీత్ సింగ్, కోశాధికారి, ఏనుగుల రాజేందర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఆనంద్‌కుమార్ బొల్ల, అశ్వక్ హైదర్, ఎం.వినయ్‌కుమార్ ముదిరాజ్, అమర్‌జిత్ రెడ్డి, జీఆర్.అశోక్, మహ్మద్ ఫయుముద్దీన్, పి.శ్రీనివాస్, ఉమారాణి, ప్రభాశంకర్, బీఎస్.రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

చాంద్రాయణగుట్ట: ఆశా వర్కర్లకు పనికి తగిన వేతనం చెల్లించాలని సీపీఎం చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్.కిషన్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 25 నుంచి జరిగే నిరవధిక సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొంటారని, ఇందుకు సంబంధించిన నోటీస్‌ను సీపీఎం నాయకులు శుక్రవారం వైద్యాధికారులకు నోటీసులను అందజేశారు. కిషన్ మాట్లాడుతూ..ఆశా వర్కర్ల సేవలను యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలలో విరివిగా వినియోగించుకుంటున్నారన్నారు. 28 వేల మంది శ్రమ దోపిడీకి గురవుతున్నారు. వారికి రూ.18 వేల వేతనాలు ఇవ్వాలని, లేనియెడల సమ్మె నిరవధికంగా కొనసాగిస్తామన్నారు.



క్షయ నివారణ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో 25 ఏళ్లుగా తెలంగాణ రాష్ట్ర క్షయ నివారణ ఉద్యోగులుగా సేవలందిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ రాష్ట్ర క్షయ నివారణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కిషన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగనాథకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోఠి డీఎంహెచ్‌ఎస్‌లో తమను క్రమబద్ధీకరించాలని ధర్నాను నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు, వైద్యశాఖ ఉన్నతాధికారులు తమ న్యాయబద్ధమైన డిమాండ్లు తీర్చడంలో జాప్యం చేస్తున్నారన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు. సీతయ్య, శ్రవణ్‌కుమార్, రహీం, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వరద ముంపు నివారణకు ప్రత్యేక చర్యలు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాలకు వరద ముంపు ప్రమాదాన్ని తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకి డివిజన్‌లోని టోలిచౌకి, నదీమ్ కాలనీ, రియాసత్‌నగర్, అక్బర్‌పురా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ఎస్‌పీ టూ, బాక్స్ టైప్ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్ల నుంచి టోలిచౌకి, నానల్‌నగర్ డివిజన్‌లలోని పలు కాలనీల్లో డ్రైనేజీ టైప్ బాక్స్ పనులు పూర్తి చేయడం జరిగిందని అన్నారు. ముందుగా టోలిచౌకి, నిజామ్ కాలనీలో బాక్స్ టైప్ డ్రైనేజీని వేయడం జరిగిందని దీని వల్ల అలహస్‌నత్, నిజామ్ కాలనీలకు శాశ్వతంగా వరద ముంపు తప్పిందన్నారు. దీనికి కొనసాగింపుగా నానల్‌నగర్‌తో పాటు టోలిచౌకి డివిజన్‌లోని రియాస్‌నగర్, నదీమ్ కాలనీ తదితర ప్రాంతాలల్లో సైతం బాక్స్ టైప్ డ్రైనేజీలను వేశామన్నారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకి డివిజన్ మజ్లిస్ నాయకులు ఆరూస్‌ఫరాన్, తదితరులున్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు

గౌలిపురా: పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో దురుసుగా ప్రవర్తించిన కేసులో ఓ వ్యక్తికి నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కె.లలిత 2 రోజుల జైలు శిక్షతో పాటు రూ.1600ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. కాలాపత్థర్ ప్రాంతానికి చెందిన మీర్జా ఫహీమ్ బేగ్ (42) స్థానికంగా న్యూసెన్స్ చేస్తున్నాడు. దీనిపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అదుపులోకి తీసుకోగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దురుసుగా ప్రవర్తించాడు. దీంతో పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకొని కోర్టులో హాజరుపరచగా నిందితునికి 2 రోజుల జైలు శిక్ష, రూ.1600ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఏజెన్సీల్లో గిరిజన ఉపాధ్యాయులనే నియమించాలి



గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీటీయూ జేఏసీ నేతలు

నాంపల్లి: రాష్ట్రంలోని షెడ్యూల్డ్ (ఏజెన్సీ) ప్రాంతాల్లో వివిధ శాఖలు నిర్వహిస్తున్న పాఠశాలల్లో స్థానిక గిరిజన ఉపాధ్యాయులతోనే నియామకాలు చేపట్టాలని, వారికే పదోన్నతులు కల్పించాలని ట్రైబల్ టీచర్స్ యూనియన్స్ (టీటీయూ) జేఏసీ డిమాండ్ చేసింది. శుక్రవారం టీటీయూ జేఏసీ ఆధ్వర్యంలో సంక్షేమ భవన్ ఎదుట గిరిజన ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. ఏటీఏ, టీఎస్‌టీటీఎఫ్, ఏటీఎఫ్, టీటీఎఫ్ సంఘాలతో పాటు లంబాడీల ఐక్య వేదిక మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రామారావు మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 244 (1) అనుసరించి 5వ షెడ్యూల్‌లో ఏజెన్సీ ప్రాంతాలను గుర్తించారన్నారు. గిరిజన ప్రాంతాల్లో చట్టాలు, హక్కుల రక్షణ, 28 శాఖలలో ఉద్యోగ నియామకాల కోసం అప్పటి ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని, అందులో విద్యా శాఖకు సంబంధించిన జీఓ నం 3 ను రద్దు చేస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. దీనిపై ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయగా, ఆ కేసు నేటికీ పెండింగ్‌లో ఉందన్నారు. తెలంగాణ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రకటించిందని, అందులో ఏజెన్సీ మైదాన ప్రాంతాలను కూడా కలిపిందన్నారు. మొదట ఏజెన్సీల్లో గిరిజన ఉపాధ్యాయులను నియమించాలని, అప్పటి వరకూ ఏజెన్సీ జిల్లాల్లో ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకుడు వి.సర్వేశ్వర్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్, టీటీఎఫ్ ఉపాధ్యక్షుడు ఎన్.భీమ్‌సింగ్, ఏటీఏ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

గోల్కొండ: పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ చైర్మన్ ఎస్.రాజువస్తాద్ అన్నారు. వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండగలను పురస్కరించుకొని గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ ఏ వర్గపు పండుగ జరిగినా అందరు కలిసి మెలిసి శాంతియుతంగా జరుపుకుంటారని అన్నారు. ఏసీపీ సయ్యద్ ఫయాజ్ మాట్లాడుతూ.. నగరంలో పోలీస్‌స్టేషన్ల పరిధులు మారాయని గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షేక్‌పేట్ ప్రస్తుతం ఫిలింనగర్ డివిజన్ పోలీస్‌స్టేషన్‌లోకి మారిందని అన్నారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, డీఐ, ఎస్సై వెంకటేష్, మైత్రి సభ్యులు అబీద్, పరమానందం, ఇలియాస్ అక్బర్, ఖైరుద్దీన్, పటేల్, షానవాజ్‌ఖాన్, ఎం.ఏ.బేగ్ ఉన్నారు.

గణపయ్యా.. పూజలందుకోవయ్యా

వాడవాడలా గణేష్ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వినాయకుల మండపాల వద్ద మండప నిర్వాహకులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధలు, వివిధ పార్టీ నేతలు మండపాల వద్దకు వచ్చి వినాయకులను దర్శించుకున్నారు. పలు ప్రాంతాల్లోని గణనాథులను నిమజ్జనానికి తరలించారు.
– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



డీసీపీ సాయి చైతన్యతో కలిసి పూజలు చేస్తున్న సీపీ సీవీ ఆనంద్



మంగళ్‌హాట్ పూసలబస్తీలో..



దారుసలాం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు



అంబికానగర్‌లో..



ఉస్మాన్‌షాహిలో.. డా. భగవంతరావు, కృష్ణగుప్తా



పూజల్లో.. అంజనా పన్వర్, ఉమామహేంద్ర



సంజయ్‌నగర్‌లో.. మిత్రకృష్ణ, ఉమేష్ తదితరులు



ఏవీఎస్‌లో.. అయిందాల కృష్ణ, సురేష్, శ్రీనివాస్‌గుప్తా



గౌలిపురాలో.. మాధవిలత, వీరేందర్ బాబు



మీరాలంమండిలో..



దూద్‌బౌలిలో..



ఇమాంపురా ఎన్‌బీఎస్‌లో.. మదిర మాధవి తదితరులు



పూజలు నిర్వహిస్తున్న ఎస్‌వీ సుబ్బయ్య దంపతులు



హరిదనగర్‌లో.. అరుణ్‌కుమార్ తదితరులు



రంగీ యూత్ క్లబ్ గణేష్‌కు పూజలు



శ్రీ సాయి సిద్ధి వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో..



సుల్తాన్‌బజార్‌లో.. మమతా సంతోష్‌గుప్తా

ప్రజా సమస్యల పరిష్కారానికి పాదయాత్ర



పనులను పరిశీలిస్తున్న మీర్జా రెహ్మత్ బేగ్, కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి పాదయాత్ర చేస్తున్నామని మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రెహ్మత్ బేగ్ తెలిపారు. శుక్రవారం రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, మజ్లిస్ పార్టీ యాకుత్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి యాసర్ ఆరాఫత్, పలు విభాగాల అధికారులతో కలిసి ఆయన యాకుత్‌పురా, బడాబజార్, చున్నేకిబట్టీ, ఈస్ట్, వెస్ట్ చంద్రానగర్, ఇమ్లిబన్, ముర్తుజానగర్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఇంటి ఇంటికి తిరుగుతూ స్థానికంగా నెలకొన్న సమస్యలపై ప్రజలతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ పార్టీ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ పర్యటనలో మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ వసీముద్దీన్, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్, పరిశుద్ధ్య విభాగాల అధికారులు, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

కారణజన్ముడు అక్కినేని



పురస్కార గ్రహీతలతో సుబ్బిరామిరెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: పద్మ విభూషన్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు కారణజన్ముడని పలువురు ప్రముఖులు కొనియాడారు. శుక్రవారం రవీంద్రభారతిలో రసమయి సంస్థ ఆధ్వర్యంలో నటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బిరామిరెడ్డి మాట్లాడుతూ..అక్కినేని నాగేశ్వరరావు కింది స్థాయి నుంచి ఉన్నతస్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అనంతరం సినీనటుడు మురళీమోహన్, ప్రవాస భారతీయులు తోటకూర ప్రసాద్, ఆకునూరి శారదతో పాటు పలువురికి పురస్కారాలను ప్రదానం చేశారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తమిళనాడు మాజీ గవర్నర్ రామ్మోహన్‌రావు, అక్కినేని కుమార్తె నాగసుశీల, మాజీ రాజ్యసభ సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, రసమయి సంస్థ వ్యవస్థాపకులు ఎంకే.రాము, వంశీ ఆర్ట్స్ థియేటర్స్ వ్యవస్థాపకులు వంశీరామరాజు పాల్గొన్నారు.

ఉస్మానియా వైద్యుల సేవలు వెలకట్టలేనివి



డాక్టర్ రమేష్‌ను సన్మానిస్తున్న డాక్టర్ వాసుదేవరెడ్డి, నాగేందర్ తదితరులు

అఫ్జల్‌గంజ్: దివ్యాంగులకు ఉస్మానియా వైద్యులు అందజేస్తున్న సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కె వాసుదేవరెడ్డి అన్నారు. ఉస్మానియా ఆస్పత్రిలోని వివిధ విభాగాలకు చెందిన వైద్యనిపుణులను ఆయన సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్‌తో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. ఉస్మానియాలోని ఆర్థోపెడిక్, న్యూరోసర్జరీ, న్యూరాలజీ తదితర విభాగాలకు చెందిన వైద్యులు దివ్యాంగులను పరీక్షించి వారికి వైకల్య ధ్రువీకరణ పత్రాలు (సదరం సర్టిఫికెట్లు) జారీ చేస్తున్నందు వల్ల ప్రభుత్వపరంగా దివ్యాంగులకు పింఛన్లు, బస్‌పాస్‌లు, ఇతర ప్రయోజనాలు సమకూరుతున్నాయని గుర్తు చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ మాట్లాడుతూ..2017 నుంచి ఇప్పటి వరకు 2599 మందికి వైకల్య ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారని గుర్తుచేశారు. అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, వైద్యులు రమేష్, మస్తాన్‌రెడ్డి, శ్రీరంగ లక్ష్మి, శ్రీనివాసులు పాల్గొన్నారు.